# "ఆత్మారోదన"

ఇది కేవలం ఊహాచిత్రం. ఆత్మలు లేవు. భగవంతుడున్నాడని నమ్మేవాళ్ళకు రామజన్మభూమి వివాదం, ఆ దేవుడికి కూడా ఇష్టం వుండదు" అని చెప్పడానికే ఈ రచన.

—జయప్రద

శ్రీరాముడి ఆత్మ, సీతాదేవి ఆత్మతో దండకారణ్యంలో జంటగా విహరిస్తోంది.

మరో ప్రక్క నడుస్తున్న వాల్మీకి కవి ఆత్మ ఈ కాలపు కావ్యం వ్రాయాలనీ, వ్రాయలేక సతమతమవుతోంది.

"మీరు అన్యథా భావించకపోతే మీతో నా మనసులోమాట చెప్పాలనుంది" జంకుతూ అంది జానకి.

"అవశ్యం" అన్నాడు జానకిరాముడు.

"నేను చనిపోయాక మీతో హాయిగా ఆనందంగా వున్నాను నాథా"" అంది సీత భర్త కళ్ళల్లోకి రియాక్షన్ కొరకు చూస్తూ.

నిట్టూర్చాడు రాముడు.

"నిజమే ప్రియతమా! త్రేతాయుగంలో తెలియక అజ్ఞానంలో నీ వియోగం కొనితెచ్చుకున్నాను.

నీ ఆ వియోగంలో కొంత, రాచరికపు బాధ్యతలతో కొంత నా జీవితాన్ని ఖర్చుచేస్తున్నాను"

అంతవరకు ఒక అడుగు వెనగ్గా నడుస్తున్న లక్ష్మణుడి ఆత్మ అన్నగారి మాటలు వింది.

"కలియుగంలో అయితే మీరేం చేసుందురు అన్నయ్యా" అని సవినయంగా అనబోయి ఆగింది.

అన్నగార్ని ప్రశ్నించడమే! తప్పుకాదూ!

సోదరుడిముందు తలవంచడమే అలవాటైన లక్ష్మణస్వామి మనసుకూడా వంచుకొని నడుస్తోంది.

ఆ దిశగా ఇద్దరు వ్యక్తులు కట్టెలు కొట్టుకుని వాటిని తలమీద మోసుకుంటూ వస్తున్నారు.

వాళ్ళ కాళ్ళకింద ఎండుటాకులు గలగలమన్నాయి.

జానకి కుతూహలంగా అటు తిరిగింది.

రాముడు గంభీరంగా చూసాడావైపు.

"నాథా! అచ్చటేమిటో!"

"తొందరపడి కోరికలు కోరేయకు దేవీ! అలనాడు ఎన్ని అవస్థలుపడ్డామో గుర్తుంది కదా?"

"మరోమారు ఆ ప్రయోగం చేస్తానా స్వామీ! అగ్నిలో కూడా దూకాల్సివచ్చే. ఈ రోజుల్లో అయితే మసయిపోదును" జోక్ చేసింది సీత.

"ఎండుటాకుల గలగల శబ్దం దూరమైపోతుంది నాథా! ముని కుమారులేమో! చాలా రోజులయింది చూసి. ఆత్మతో చూద్దాము మీమీద ఆన. ఏలాటి కోరికా కోరను"

అలనాడు అడవుల్లో కష్టకష్టాలు పడ్డాక కూడా నిండు గర్భిణి అయ్యి మీతో మరలా అడవులకెళ్ళాలని వుంది" అని భర్తను గోముగా అడిగిన భావుకురాలు ఆమె.

"అది సరే నీష్టము కాదంటానా?" అని నావేపుగా ఆత్మతో సహా కదిలాడు రాముడు.

కానీ పాపం సీత నిరాశపడింది.

వాళ్ళు మునికుమారులు కాదు. కట్టెలు కొట్టుకునేవాళ్ళు.

కట్టెల కోసం ఇంతదూరం ఎలా వచ్చారబ్బా వీళ్ళు? వీళ్ళను నది దాటించను ఇంకా గుహుడు బ్రతికున్నాడా? అని ఆశ్చర్యపోయాడు అయోధ్యరాముడు.

తన స్వామి ఎటు వెళ్ళాడబ్బా అని వెతుక్కుంటూ వచ్చిన వాల్మీకి కూడా ఆ కట్టెల మనుష్యులు మాటలు విన్పించాయి.

అందులో కాస్త ముసలిగా వున్నతను పడుచువాడితో అంటు న్నాడు.

"అరె! భోళాశంకరా! అదేవిటిరా అయోధ్యలో కొట్టుకుంటున్నా రట."

"నా పేరు భోళాశంకర్ కాదు. ఉత్తశంకర్."

"ఏదోలేరా?" చెప్పరాబాబూ, చదువుకున్నావని మహా విర్రవీగు తున్నావు గానీ"

"ఏవుందిలే మావా! అయోధ్యలో రాముడి గుడి కట్టాలంట" శ్రీరాముడికి చాలా సంతోషమైంది.

తనకింకా గుడులు కడ్తున్నారన్న మాట.

"గుడి కట్టడానికి గొడవ లెందుకురా. మనూళ్ళోనూ రాముడి గుడి వుంది కదా!"

"ఆఁ రాముడి గుడిలేని ఊరు, శ్రీరామనవమి చేయని వాడా వున్నాయా?"

రాముడి ఆత్మ బెలూన్‌లా ఉబ్బిపోతోంది. వాల్మీకి, లక్ష్మణుడు కూడా చాలా సంబర పడ్డారు. తమ స్వామికి ఊరికొకగుడి, సంవత్సరానికో పెళ్ళి! పిల్లలకు బళ్ళు, కన్యలకు పెళ్ళిళ్ళు లేకపోతేనా—

"అది కాదురా ఎదవా ఈ గొడవ లెందుకంట."

"చెపుతా! మనోళ్ళు ముసల్మానుల మసీదు పగలగొట్టి శ్రీరాముడి గుడి కట్టాలంటారు. ఆళ్ళు ఈఁల్లేదంటారు." కాలికడ్డం పడ్డ ముళ్ళ పొదను ప్రక్కకు నెడుతూ అన్నాడు శంకర్.

"ఓరీ వాళ్ళు ఆగడం కూలా? అయోధ్దెలో మన గుడి కట్టను సందేలేదంటారా?"

"అబ్బ! నీకు సెప్పలేను మావా! సందెందుకు లేదూ! పాపం సర్కారోళ్ళు బెతిమాలుతుంటేనూ వేరేదగ్గర కట్టుకోమనీ...."

"కట్టుకుంటే పోలా?"

"ఆ మసీదు కట్టిందీ మన దేవుడి స్థలంలోనంట. అదీ తగవు."

"నిజమేలేరో! అయోధ్దెలో మసీదేవిటి? అది రాముడి పుట్టినూరయితే"

శంకర్ అనబడే ఆ యువకుడు ఏదో జవాబు చెప్పబోయి ఆగి వంగి, ఎండుకొమ్మ విరిచి మోపులో దోపి కట్టుకుంటున్నాడు.

"అయితే గుడి కట్టరంటావా?"

"మసీదు స్థలంలో గుడికట్టడానికి ముసల్మానులు ఒప్పుకోవద్దూ" అనేసి గలగల నడవ సాగాడు శంకర్. కొత్తగా పెళ్ళయిందేమో అనుకుంది సీత.

అప్పుడే షికారుకెళ్ళి గంతులేస్తూ తిరిగొచ్చిన ఆంజనేయుడి ఆత్మ ఆ కట్టెలు కొట్టుకునే వాళ్ళ ఆఖరి మాటలు విని కుతకుత ఉడికి పోయింది. లక్ష్మణుడికి కూడా స్పృహ వచ్చింది. చాలా కోపంకూడా వచ్చింది.

"ఎవడురా వాడు మా అన్నగారికి గుడి కట్టకూటదన్నవాడు. ఇక నేను సహించేది లేదు."

"శ్రీరామచంద్ర ప్రభూ! అనతివ్వండి. అలనాడు లంకాదహనం కావించినట్టే ఆ ముసీదును నేలరాసిపారేస్తాను" హనుమంతుడు తోక సవరించుకున్నాడు. కట్టెల వాళ్ళకు ఆ మాటలు విన్పించలేదుగానీ సహ ఆత్మలకు విన్పించాయి.

"సోదరా శాంతించు. హనుమా! ఆగు నాయనా!" మురిపంగా అన్నాడు రాఘవేంద్రుడు.

సీతాదేవి మాత్రం ఇవేమీ పట్టించుకోవడంలేదు. ప్రకృతి ఆస్వాదనలో మునిగిపోయి వుంది. ఆమె తన స్వామికి గుడికట్టినా కట్టక పోయినా అతను దేవుడే.

లక్ష్మణుడు తలవంచుకున్నాడు. భాతృ ఆజ్ఞకు బద్ధుడతను. అతనికి వ్యక్తిత్వంలేదు. కానీ వాయునందనుడు ఊర్కోలేదు. తల గోక్కుంటూ అన్నాడు.

"స్వామీ! మీరు ఏలిన అయోధ్యలో మీ గుడి కట్టడానికి వివాదాలా? మీ సొమ్ముకాదా! అయోధ్యావాసులు తిన్నదానాడు. మీరు అనుమతించండి. మీ ప్రతినిధిగా నేను వెళతాను. మీ గుడి ఎలా కట్టరో చూస్తాను. చిరునవ్వు నవ్వాడు సీతారాముడు.

"నువ్వంటావుగానీ మావా! దేవుడికి గుడికట్టాల్సిందేనని ఎంత మంది పేదప్రజలు దీనివల్ల పేణాలు పోగొట్టుకున్నారు. పాపం మావా! ఆళ్ళ పెళ్ళాలూ, బిడ్డలూ."

కౌసల్యా తనయుడు "విన్నావా! అన్నట్టు రామభక్త హనుమాన్ వైపు దీర్ఘంగా చూసాడు.

"అందరూ ఏదో అనుకుంటారని వూర్కుంటామా! అనాడు సీతమ్మతల్లిని చెరపట్టి తీసుకెళ్ళిన ఆ రాక్షసుడు రావణాసురుణ్ణి వదిలే సామా? యుద్ధం చేయలేదూ? అప్పుడు మాత్రం జనం చావలేదూ? మా రామయ్యకు గుడి కట్టనంటారా? వాళ్ళపని తేల్చుకొచ్చేస్తాను." వీరా వేశంతో ఊగిపోతున్నాడు వీరాంజనేయులు.

ఈ మాటలేవీ విన్పించని మానవులిద్దరూ కట్టెలు ఏరుకుంటూ కబుర్లు చెప్పుకుంటూనే వున్నారు.

"రేపు మళ్ళా కరసేవ అంట మావా! జనం ఢిల్లీకి తండోప తండాలుగా వెళ్తున్నారు."

కరసేవా! అంటే ఏవిటో తెలుసుకోవాలని మహాకుతూహలంగా వుంది. కాని ఎలా అడగడం? తన మాటలు ఆ మూర్ఖమానవులకు విన్పించవే" నిరాశపడి ఊరుకున్నాడు హనుమ.

కానీ ఆ ముసలాడు మాత్రం ఊర్కోలేదు. ఆత్మ అడగాలను కున్నది ఆయన అడిగేసాడు.

"కరసేవ అంటే రామభక్తులంతా కలిసి అయోధ్యకు వెళ్తు న్నారు రామభజనలు చేయడానికి."

"శంకర్ జవాబు పూర్తిగా తృప్తి నివ్వలేదు అమరభక్త ఆంజ నేయులకు. ఇంతేనా? మసీదు పగలగొట్టరా? మా దేవుడి గుడి కట్టరా?"

"అనుమతివ్వండి స్వామీ నేను రేపు అయోధ్యకు వెళ్ళి చేయాల్సి నది చేసేసి మరీ వస్తాను."

దిగులుగా నవ్వాడు రాముడు.

"అక్కరలేదు హనుమా! నీలాటివాళ్ళు లక్షలమంది వెళ్తున్నారు చాలు.

హనుమంతుడు తోకముడిచాడు. ముసలాడు అన్నాడు.

"అయితే శంకరా? ఎల్లుండో మర్నాడో మరలా కట్టెలకొస్తావుగా ఆ రోజు పేపరు చదివేసిరా నాకు ఇసయం చెప్దూగానీ...."

"అట్టాగే"

* * * *

ఆ మూడోరోజు ఆత్మలు మానవమాత్రులకొరకు ఎదురు చూస్తున్నాయి. దూరాన ఎండుటాకుల గలగల శబ్దాలు ఆత్మలన్నీ ఆసక్తిగా అటువైపు వెళ్ళాయి.

అయితే నువ్వనేది భజనలు చేయకుండా మనోళ్ళు "అంతలావు మసీదు పగల గొట్టేసారంటావా చాలా అన్యాయం."

"ఇదేవిటి మావా! పుట్టిగోడలు రాలిపోయాయంతే. ఆ తర్వాత నా సామిరంగా ముసల్మానులు హిందువులూ కొట్టుకు చస్తున్నారు. ఎన్ని చావులనీ....దిగులుగా చూసాడు ముసలాయన."

"అమాయకులంతా బలయిపోయారంటే నమ్ము. ఉత్తపుణ్ణేనికి హిందువులని మహమ్మదీయులు, సాయిబులనీ హిందువులు కొట్టుకు చస్తున్నారు చాలా గోరం మావా!"

అది విన్న వాయుపుత్రుడికీ, సుమిత్రా తనయుడికి చాలా ఆనందంగా వుంది.

"ఆయినా దేనికోసం ఇంతమంది చావడం. అన్యాయంలేరా శంకరా. ఆళ్ళ భార్యాబిడ్డల గోడు తగల్దా?"

"అవునూ ఇంతకీ గుడి పగలగొట్టడమే కదా ఆళ్ళు చేసిందీ."

"కాదు మావా! అప్పుడే చిన్న రామాలయంకూడా కట్టేసారు. మాటల్లోపడి కట్టిలేరదంలేదు. పదపద పొద్దుపోతుంది."

వాళ్ళమాటలు విన్న రామభక్తుడు ఆత్మ చిన్నబుచ్చుకుంది.

"చిన్నగుడా? పెద్దగుడికడితే వీళ్ళ సొమ్మేంపోయిందో చేతులు జోడించి సవినయంగా వ్యధను వెళ్ళబోసుకున్నాడతను"

"హనుమా! నాకు గుడెందుకు? చిరునవ్వుతో ప్రశ్నించాడు రఘురాములవారు. తడబడ్డాడు హనుమంతులవారు.

"గుడీ....గుడీ....ఆదేస్వామీ మనిషికి ఇల్లు, దేవుడికి గుడి కావాల్సిందే కదా!"

"గుడి ఎందుకు నాయనా?" గంభీరంగా అడిగాడు రఘుకులేసుడు.

"భలేవారే స్వామీ! మీకు నైవేద్యం పెట్టడానికీ, ఏకాంత సేవ చేయడానికీ, మేలుకొలుపు పాడడానికి దానికీ...."

"మరి నేను భగవంతుణ్ణనేకదా! మన వాల్మీకి నువ్వూ కూడా అంటున్నది" వాల్మీకి గతుక్కుమన్నాడు.

"దానికి సందేహమా స్వామీ!" మరలా చేతులు జోడించాడా భక్తుడు. వానర యోధుడు.

"అయితే అకలికి, నిద్రకు నేను అతీతుణ్ని కదా! మరి నాకు స్థావరం....అదే గుడెందుకు నాయనా?" ఇక్కడ రామ భక్తుడు ఇరుకున పడ్డాడు.

"అదేమిటి స్వామీ....మీ భక్తులు మిమ్మల్ని కొలుచుకోవడానికి గుడికావాలికదా!" దశరథనందనుని పెదాలమీద చెరగని దరహాసం.

"నా భక్తుల గుండెల్లో నా జ్ఞాపకపు గుడి వుంటే చాలదా వాయు పుత్రా. నామీద భక్తి పేరున నా బిడ్డలు ఒకరినొకరు నరుక్కోవడం నాకు సంతోషమా నాయనా."

"వాళ్ళ ప్రాణాల్ని నేను వాళ్ళకు తిరిగి ఇవ్వగలనా చెప్పూ"

సిగ్గుతో హనుమంతుని శిరస్సు వంగిపోయింది. లక్ష్మణుడు అవును "కదా!" అని అప్పుడనుకున్నాడు.

సీతాదేవి అంతా విని "మానవ మేధస్సు పెరిగిందనుకున్నానే ఇంకా ఇంత అమాయకులా ఈ మానవులు!" అని నిట్టూర్చింది.

వాల్మీకి ఆత్మ పశ్చాత్తాపంతో కృంగిపోయింది.

"నా భావితరాల ప్రజలు ఇంత మూర్ఖులు, అజ్ఞానులు అని వూహించివుంటే ఆనాడు ఓ మంచి మనిషిని మనిషిగా చిత్రించి రామాయణ కావ్యం వ్రాయకపోదును" అనుకున్నాడు వాల్మీకి.

*